
# ఇంతి-వేదాంతి



ఆది ఆంధ్రదేశంలో పల్లె పట్నముగాని ఒక వూరు. అప్పుడప్పుడే బస్సుల రాకపోకలు ఆవూరి గుండా సాగుతున్నాయ్. ప్రజలు నాగరికత—అనాగరికతల మధ్య కొట్టు మిట్టాడు తున్నారు. తోలు బొమ్మలాటల నుండి ఇప్పుడిప్పుడే వారి దృష్టి సినిమాల వైపు మారుతూంది. దొమ్మరాటలనుండి, సర్కస్ వైపు దృష్టిమళ్లిన మాట కూడ వాస్తవమే. కాని, సర్కస్ సంవత్సరంలో ఏ ఒక్కసారి మాత్రమో, లభ్యమవుతుంది. దొమ్మరవాళ్లు మాత్రం తరుచూ వస్తూ ఉంటారు. వూరిలోని వాళ్ళు పేటకు కొంత వసూలు చేసి ప్రతి నాలుగుపేటలు కలిసేచోట దొమ్మరాటలు వేయించడం కద్దు. ఆ విధంగా ఆవూరికి ప్రతి సంవత్సరం వరుస తప్పక వచ్చే వారిలో వీరమల్లు ఒకడు.

వీరమల్లు ఆటలో ఓ ప్రత్యేకత ఉంది. వాడు అట్టహాసంగా ఆర్భాటం చేయడు. నిర్ణయించుకున్న, నాలుగు పేటలు కలిసే నడివీధిలో చేరుతాడు. ఢమరుక మ్రోగిస్తాడు. ఘల్లు ఘల్లున గజ్జెలు రవళిస్తాడు, వూరిలోని జనం గుభిల్లుమనేలా—గగుర్పాటు చెందేలా. ఆటలో సంగీతముంటుంది. లయ, తాళాలు మాత్రముండవు. నాట్యం కూడ ఓ పాలు పంచుకుంటుంది. అది కూడ ఒడిదుడుకుల అడుగులే! ఏ మాత్రం అభ్యసించిందికాదు. అందర్నీ ఆకర్షించుతుంది. అందరికీవింత గొలుపుతుంది. ఆనందాన్నిస్తుంది. అందుకే వీరమల్లు ఆటకు ప్రత్యేకతాస్థానముంది ఆ వూరిలో.

ఈ సంవత్సరం వీరమల్లు పంట పండింది. రెండు సంవత్సరాల క్రిందట ఎక్కడ నుండో ఆ వూరికొచ్చి అక్కడే స్థిరపడ్డ భూపతి వీరమల్లును తమవీధి మొగసాలలో, మేడకెదురుగా ఆట వేయించ వలసినదిగా ఆజ్ఞాపించారు. భూపతి గారు ధర్మాత్ములనీ, న్యాయశీలి అనీ, ఆవూరిలో ప్రతీతి. కాని, ఆయన గత చరిత్ర ఏదో—ఎక్కడినుండి వచ్చాడో — ఆవూరి వారికి అర్థం కాని కొన్నిప్రశ్నలు. ఎవరైనా ఆయనతో అంతరంగికంగా ఆవిషయాలలో జోక్యం కలిగించుకొని కదిపినా అలాంటప్పుడు నొసటిమీద ఏర్పడే మూడు ముడతలు మాత్రం సుస్పష్టంగా కనిపిస్తుంటాయ్. ఆ నిట్టూర్పులో ఏదో అంతర్భూతమైన ఆవేదన దాగివుందని గ్రహించిన వాళ్లు ఆయనను గుచ్చిగుచ్చి అడిగి బాధపెట్ట

జె. ప్రకాష్

లేదు. మరికొందరు ఆయన అంటున్నా, అప్పటికి చూసి ఎవరూ నోరు మెదపలేకపోయారు. భూపతిగారికి ఎప్పుడూ సరదాలు ఉండేవట. కాని, ఈ రెండు సంవత్సరాలలోను ఏనాడూ ఇలా ఆటలనాడించలేకపోయాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్న వాడిలాగ వేదాంత మాదిరి తిరస్కార భావంతో ఉండేవాడు. కాని, వీరమల్లు సంతపేటలో వేసిన ఆట బ్రహ్మాండంగా ఉండిన దని చాలా మంది అన్నారు. ఆవిషయం భూపతి వరకు కూడ వచ్చింది. తనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా, ఆట నాడించవలసినదిగా వీరమల్లుకు ఆదేశించాడు. భూపతి మాట వీరమల్లుకు వరాల మూటగా వినిపించింది.

అందరికీ దండం పెట్టి, వీరమల్లు ఆటకు ఉపక్రమించాడు. చుట్టూ జనం వృత్తాకారంలో గుమికూడారు. వృత్తం మధ్యలో ముసుగులో సాని ఉంది. ప్రతి ప్రదర్శనకూ వీరమల్లు అంతే చేస్తాడు. ప్రతి సంవత్సరం ఏదో ఒక ఆట కత్తెకు బాగా తర్ఫీదు నిచ్చి తెస్తాడు. ఈ సారి ఎవరో, ఎంతటి సుందరో, ఎంతటి నేర్పరో— అని జనమంతా ఉత్సుకతతో చూచేవేళ ముసుగు తొలగిస్తాడు. జనమంతా సంభ్రమంతో నివ్వెర పోయేలా. సరిగ్గా, ఈసారీ అలాగే చేశాడు.

ఎదుట నించిందో జగదేక సుందరి. కట్టు కున్న చీరగాని, రవికెగాని ఆమెకు మెరుగులు దిద్దటం లేదు. కాగా, శరీరంలోని ప్రతిభాగాన్ని పైకి చూపుతూ, ఏ అవయువం ఎలా అమరిందో వ్రేలెత్తి చూపెట్టి, గిలిగింతలు పెడుతున్నాయ్. సుందరి వయసు ఇరవై సంవత్సరాలుంటుంది. దొండపండులాంటి పెదాలు — కోడేరు వేసి నట్టున్న ముక్కు — చిన్ననోరు — వెడల్పాటి చంచరీకములైన కళ్ళు — కుదురైన నుదురు— ఎగదీసి కట్టిన నిడుపైన కురులు — పొంగు కొస్తున్న యువ్వనం — కళ్ళు మిరుమిట్లు గొలిపి నట్టుంది జనంలో.

ఆమె ఆడుతోంది. పాడుతోంది. పద కదలిక విన్యాసం మయూర నృత్యాన్ని మరపిస్తోంది. కంఠం వసంతోదయవేళ చిగుళ్ళు మెక్కి ఆలాపించే కోయిలను గుర్తుకు తెస్తోంది.

ఆయాసమొచ్చింది. ఆమె ఆటనాపింది. పాట కొనసాగి పోతోంది. గళంలోని అలలు పూరిపోని పలుకువాళ్ళతో పోటీ పడుతున్నాయ్. పాట వచ్చిన దిక్కుగా పదిమంది పోస్తై పరుగిడు తున్నారు. పాట ఉన్నతమండలానికి చేరబో తోంది.

కాని, గొంతు జీరవోయింది! సవరించినా పలుకలేదు! వీణాతంత్రులు తెగితే మీటడం సాధ్యమా! ?

వీరమల్లు నివ్వెరపోయాడు!

దొమ్మరసాని వెలవెల పోయింది!

ఒకేసారి ఆశ్చర్యం, ఉద్వేగం, పశ్చాత్తాపం వ్యక్తమయ్యాయి ఆమె ముఖంలో.

పేడమీద కూర్చున్న భూపతి సంకటంగా కదిలి, పరికించగా క్రిందకు చూశారు. మళ్ళీ మామూలు స్థితికి చేరుకునేంతలో దొమ్మరివాడు పట్టుకున్న పొడుగాటి 'గడె' మీద ఆయన చూపులు నిలిచాయి. 'గడె' సరిగ్గా పేడ అంచుకు సమానంగా ఉంది.

వీరమల్లు ఒకసారి లఘువు చూపించి, గడెను బొడ్డుమీద నిలిపి విల్లులా వంగిపోయాడు. సాని వాడి రొడలమీద కెక్కి గడనందుకుంది. భయమనేది లేకుండా ముందుకు సాగిపోతోంది. వీరమల్లు మెల్లగా లేచి నిలబడ్డాడు. ఎలా ఉన్న గడె అలాగే ఉంది. కొంచెం మారలేదు. గడె కదలలేదు.

దొమ్మరసాని ఒకచోట ఆగింది. కాళ్ళు పెనవేసి, చేతులమోడ్చి అందరికీ దండం పెట్టింది. గడె కొద్దిగా కదిలింది. జనం జలద రించి పోయారు. దొమ్మరసాని విహ్వలయ్యై చూచింది. గడెమళ్ళీ యదాస్థానంలో నిలిచింది.

ఎంత ఆపదతో కూడిన జీవితం ? దొమ్మర సాని మనసు పరిపరి విధాల పోయింది. కూటి కోసం ప్రాణాలతో చెలగాటమాడవలసిన గతి పట్టింది. ఆమె కళ్లలో గిర్రున నీళ్ళు తిరి గాయ్. చేసేదిలేక ముందుకు సాగింది!

* * *

ఆ సంవత్సరం సుంకులమ్మ జాతరు జోరుగా జరుగుతున్నాయ్. కిష్టిలపల్లె సీతారాంగారు తన కుటుంబంతో సహా తిరనాళ్ళకు వచ్చారు. సీతా రాం గారు కోడెంంటే ఆ ప్రాంతంలో చాలా పేరుంది. బండలాగడంలో వాటికవే సాటి సీతారాం గారికి కూతురైన సుబ్బమ్మమీద ఎంత ప్రేమో వాటిమీదకూడా అంత ప్రేమ!

సుబ్బమ్మ, సీతారాంరెడ్డి—లక్ష్మీదేవమ్మలకు ఒక్కతే.కూతురు కావటంవల్ల అతి గారాబంగా పెరిగింది. ఇంట్లో ఎప్పుడూ పనిమనుషులూ, పాలేర్లూ ఉన్నందువల్ల, కాలు క్రింద పెట్టకుండా సుకుమారంగా పెరిగింది. చిన్నతనం నుండీ పట్టిన పట్టును నెరవేర్చు కొనడం బాగా అల వర్చుకుంది.

యుక్త వయస్సురాగానే సుబ్బమ్మకు పెళ్లి చేయాలని సంకల్పించాడు సీతారాంగారు. కాని తగిన మనువు కుదురలేదు. ఒకటి రెండు సంబం ధాలు వచ్చినా, తమ అంతస్థుకు తగినవి కాదనీ ముఖావంగా పూరుకున్నారు. అంతే. ఆ తర్వాత ఆ ప్రసక్తి రాలేదు.

యుక్త వయస్కురాలైనప్పటి నుండీ, సుబ్బ మ్మకుకట్టడులెక్కువైపోయాయ్. ఇంటినుండి బయటికి పోవడానికి వీలులేదు. ఎవరితోనైనా మాట్లాడితే తప్పు. అందుకే ఒంటరిగా కూర్చొని ఏవేవో ఆలోచించుకునేది. చిన్నతనపు బొమ్మల పెళ్లిళ్లు—గుజ్జనగూళ్లు—పిల్లలతో ఆటలు— ఏవేవో మెదిలేవి మదిలో. కాని కాలు కదపలేక వెలితిగా—అసంతృప్తిగా— కాలాన్ని వెళ్లబుచ్చేది

ప్రతి సంవత్సరం [illegible] జాత రంబు జరుగుతూ ఉంటుంది. ఈ సారి సంటోడి పెళ్లాలో పుట్టకోడె, కుకోడె [illegible] [illegible]. [illegible] గెలుపు అనడన్న ధీమాతో సీతారాంగారు [illegible] పెంచుతున్నారు. సంటోడిమీద [illegible] చాలా నమ్మకం. వాడువచ్చినతర్వాతనే ఆ కోడెలు పేరుగాంచాయని—అదంతా వాడి ప్రయోజనమని ఆయన అనుకుంటారు. ఈ నమ్మకమే ఏమా లేకుండా పట్టు చేతోపట్టుకొని వచ్చిన సంటో డిని ఒక ఇంటివాడిని చేయించి, తన ఇంట్లో పాలేరుగా పెట్టుకొనేట్టు చేసింది. సీతారాం గారంటే భయంతోనూ — భక్తితోనూ మసలుతుంటాడు సంటోడు.

సాయంత్రం కావస్తోంది. సదరికానికి జనం తండోపతండాలుగా పోతున్నారు. గాలి బుడగలు—సోడాలు—చెరకుగడలు — గాజులం గళ్లు—రంగులరాట్నాలు—పసుపు బండారాలషాపులు ఇంకా ఏవేవో ఇసుక తిన్నెలమీద బారులు బారులు వెలిశాయి. ఈలలు— పూలలు—డప్పుల రవ ళులు—చెన్నకోలల మ్రోతలు — హోరెత్తి పోతోంది తిరణాల.

సుబ్బమ్మ మనసు తిరణాల చూడాలని ఉబ లాట పడింది. లక్ష్మీదేవమ్మగారు ప్రయాణపు బడలికవల్ల అలసటగా పడుకొని ఉంది. కూతురు కోరికను కాదనలేక, సంటోడిని ఆసరాగా పంపింది.

సంటోడు వెంటరాగా, సుబ్బమ్మ తిరణాంలో ప్రవేశించింది. గాజులు వేయించుకుంది. రిబ్బ నలు బేరమాడింది. బొమ్మలను కొనింది. సంటో డుమాత్రం సుబ్బమ్మకాలు పడిపోకుండా దూరం మగా నిలుచుని చూస్తుండేవాడు. కొన్నవస్తువు లన్నిటినీ సంటోడికి తీసుకురమ్మని, బండిదగ్గరకు బయలుదేరింది సుబ్బమ్మ. దారిలో రంగుల రంగులరాట్నాలు తిరుగుతున్నాయ్. అది తిరగడం చూసేకొద్దీ సుబ్బమ్మకెంతోసరదా వేసింది.ఆడ— మగా అందరూ అందులో తిరుగుతున్నారు. ఒకటే గోలగా ఉంది. సుబ్బమ్మకు ఎక్కడలేని హుషారు పుట్టుకొచ్చింది. తనూ తిరిగుతేనో! రంగులరాటం ఆగింది. సుబ్బమ్మ తొట్టెలో కూర్చుంది. దూరంగా నిలుచున్న సంటోడినికూడ ఎక్కమంది. ప్రక్క తొట్టెలో కూర్చోబోతున్న వాడిని తనతొట్టెలోనే కూర్చోమని పట్టు పట్టింది. ఆమె మాట కడ్డు చెప్పలేక ఒదిగి కూర్చున్నాడో మూల. ఇరుసు దగ్గర రంగుల రాట్నాన్ని త్రిప్పడం మొదలు పెట్టారు. బాగా వేగాన్నందుకుంది. తొట్టెలో కూర్చున్నసుబ్బమ్మ కొక్కసారి వికారమైనట్టు తోచింది. మరు నిమి షంలోకళ్లు తిరిగాయ్. ఒక్కనిమిషం అలా వరి గింది సంటోడి ముందుకు. వాడు పడిపోకుండా పట్టుకున్నాడు. కొద్దిసేపటికి సుబ్బమ్మ తెరపి ఇచ్చింది. కళ్ళు తెరిచేసరికి, సంటోడి వడిలో ఉంది తాను. భయపడిపోయింది. సిగ్గుతో కుంచించుక



పాములవాడు -- ఫొటో: శ్రీనివాస్ బ్రదర్స్ -

పోయి సర్దుకొని కూర్చుంది.

రంగులరాట్నం ఆగింది. ఇద్దరూ క్రిందకు దిగి, ఒకరినొకరు చూసుకోలేక బండి విడిచిన చోటుకు బయలు దేరారు. చిన్నమ్మగారేమనుకున్నారో నని సంటోడికి భయం. వాడేమనుకున్నాడో నని సుబ్బమ్మకు ఆందోళన—సిగ్గూనూ. ఈ భావాల నుండి తేరుకోకుండానే బండి దగ్గరకు నడిచారు. సీతారాంగార్లు అప్పుడే వూరిలోనుండి వచ్చినట్టుంది. పాలేర్లు పులగం చేశారు. కమ్మగా నేతితో పులగం సయించకపోయింది సుబ్బమ్మకెందుకో! సంటోడు అటంతా ఎప్పుడో మరచిపోయాడు. ''భూపతి ఎద్దులు కూడ వచ్చినయ్. జాగ్రత్తగా వుండాలిసుమా!' అని సీతారాంగార్లు వాడిని హెచ్చరించి, హుషారిస్తున్నాడు. సుబ్బమ్మకేవేమో పట్టక—నిద్రరాక—నిద్ర పోయిందెప్పుడో?

ఆ మరునటి దినం సీతారాంగార్ల ఎద్దులే పందెంలో గెలిచాయ్. ఆఖరు నిముషం వరకూ పందెం భూపతిదే ననుకున్నారంతా. సంటోడి మెలకువతో ఆఖరు పూనికలో నూరు గజాలు పూపేశాయ్ కోడెలు. అంతవరకూ, ఆశలువదలుకొని గుంపుదూరంగా పరాభవంతో కుంచించుపోతున్న సీతారాంగారిముఖం ఒక్కసారి వికసించింది. గుంపులోని జనమంతా సంటోడిని 'భేషం భేషేష్'అనిమెచ్చుకున్నారు. సీతారాంగారికి ఆ క్షణంలో వాడిమీద ఎంతో గురి ఏర్పడింది. ఆ సాయంత్రం ఎద్దులను ఊరేగింపులో వూరేగించారు. వూరిలోని పూలన్నీ ఎద్దులమీదనే ఉన్నాయ్. భూపతిగారు కూడ సీతారాంగారి ఎద్దులనుఎంతోమెచ్చుకున్నాడు.ఆయన కెప్పుడూ తన ఎద్దులే గెలవాలని లేదు. ఎదుటి ఎద్దులు తనవాటికంటే మంచివీ వాటమైనవీ అనుకున్నప్పుడు వాటిని ప్రశంసించకుండా ఉండలేదు. అందుకే, తన తరువు సీతారాంగారి కోడెలకు బంగారు పతకాలు వేయించాడు. సంటోడికో ఉంగరం కూడా బహూకరించాడు. ఎన్నికగన్న సేద్యగాళ్ళంటే ఆయన కెంతో మక్కువ.

భూపతి మొదటి భార్య ఈ మధ్యనే కాలమైపోయింది. చిన్న పిల్లలిద్దరున్నారు. బంధువులు పెళ్ళిచేసుకోమన్నా చేసికోలేదు. భూపతి ని చూడగానే శీతారాంగారికి తగిన సంబంధమని పించింది. ఆ విషయాన్నే లక్ష్మీదేవమ్మతో కదిలించాడు. ఆమె 'రెండో పెళ్ళి సంబంధమే' అని నసిగింది. ''దానిదేముంది. బోలెడంతఆస్తివుంది, తగిన సంబంధము. అమ్మాయి మనకంటే రెండు అంతస్తులు ఎక్కువగా ఉంటుంది. అయినా, అతనికే ఎన్నోఏళ్ళు లేవుగా. ఏమీ మాట్లాడకుండా ఈ సంబంధాన్ని స్థిరపరుచుకుంటేసరి'' అన్నారాయన.

అంతవరకూ పెళ్ళివద్దన్న భూపతిలో ఏం మార్పు వచ్చిందో, శీతారాంగారు పెళ్ళిప్రస్తావన తీసుకురాగానే టక్కున తన అంగీకారాన్ని తెలిపేశాడు. అట్టహాసంగా పెళ్ళిజరిగిపోయింది.

* * *

దొమ్మరసాని ఒక చోట ఆగింది. వళ్ళంతా చెమట గ్రక్కుతోంది. పెదవులమీద హాసరేఖ వెలువడింది. పేలవంగా. రెండు కాళ్ళనూ పెనవేసి చేతులొదిలింది. మెడలోని నల్లనిదారం నిక్కపొడుచుకొని వుంటుంది వున్నట్టి వక్షోజాలు భూమికీ—ఆకాశానికీ మధ్యన ప్రేలాడుతున్నాయ్. జనమంతా ముగ్ధులై చూస్తున్నారు. యథాస్థానానికి కొచ్చిన దొమ్మరసాని మళ్లీముందుకు సాగింది.

ఆరోజు డాబామీద సుబ్బమ్మ ఒంటరిగా కూర్చొనివుంది. కాపురానికొచ్చి అప్పుడే సంవత్సరమవుతూంది. కాని, ఇంతవరకూ ఎవరో చెప్పిన మాధుర్యాన్ని తాను అనుభవింప లేకపోతోంది. ఇంటి కంతా సుబ్బమ్మ ఒక్కతే! పిల్లలున్నారు. అయినా వాళ్ళతో ఎంతకాలమని ఆడుకోగలదు? భూపతి ఎప్పుడూ ఎద్లను విచారించడంలోనో—పాలేర్లకు పనులు పురమాయించడంలోనో మునిగిపోయుండేవాడు. కాపురానికొచ్చిన క్రొత్తలో ''పిల్లల బాగోగులు నీవే'' నన్నాడు. దానికి సుబ్బమ్మ ఎంతగానో సంతోషించి ఒప్పుకుంది.

దూరంగా కొండలు. కొండలను తాకుతూ ఆకాశం— ఆ బారుల సందులగుండా తెల్లటి కొంగలు ఎగురుతున్నాయ్. సుబ్బమ్మ అటే చూస్తూంది. భూపతి స్నానం చేసి పైకి వచ్చాడు. ''ఏమిటో దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్'' అంటూ వచ్చి ప్రక్కన నిలబడ్డాడు.

సుబ్బమ్మ ఉలికిపడి ''ఎప్పుడొచ్చారు'' అంది.

''ఇప్పుడేలే. ఏమైనా ఏకాంతానికి భంగం కలిగించానా'' అతని మాటల్లో గౌరవం, అభిమానం ప్రేమ ఉట్టిపడ్డాయ్.

''అబ్బే. ఏమీ లేదండీ. దూరాన ఉండే కొండలు ఎంత నునుపుగా ఉన్నాయో''అని ఆలోచిస్తున్నాను. పిలవనన్నా పిలవకపోయారు.

ఆ కొండలు చలా అందంగా ఉన్నాయి కదూ'' అంది ముద్దుగా.

''దూరంగా ఉన్నప్పుడు అలాగే ఉంటాయ్. దగ్గరకు పోతేనే ముళ్ళు—రాళ్ళు—రప్పలు కనిపించేది. ఏమంటావ్'' అన్నాడు భూపతి

''దగ్గరకుపోతే ఎలా ఉన్నా, ఇక్కడ నుండి చూసి, వాటి అందానికి మనసు పడక పోముకదా'' అంది సుబ్బమ్మ.

భూపతి కి ఆమె అభిప్రాయాన్ని మార్చాలని కాని, తన దారిలో నడవాలని కాని ఎన్నడూ లేదు. సుబ్బమ్మ ప్రకృతిలో పరవశం చెందగలదు. అతడు అలా చేయలేడు.

జీవితంలో ఎన్నో హెచ్చు తగ్గులతడు చూసి వాటి యదార్థ రూపాలను జీర్ణించుకున్నాడు.

చంద్రుడు పైపైకి వస్తున్నాడు. భూపతి అలాగే మంచంమీద కూర్చున్నాడు.

''ఎదుట అప్సరసలాంటి పడుచును పెట్టుకొని చలనం లేకుండా ఉంటాడు.అతడేం మనిషి? సుబ్బమ్మ కొకసారి కోపం వచ్చింది. కానీ, ఏమీ చేయలేదు.

భ.భూపతి లేచి క్రిందకు వెళ్ళిపోయాడు. ఆమెకు దుఃఖం కట్టలు త్రెంచుకొచ్చింది. ఏం చేస్తుంది.. మెల్లగా మెట్లదారి వెంట అడుగు లెంచుతూ దిగినట్టు దిగింది. భోజనాల అనంతరం డాబా పైకివచ్చి పడుకుంది.వీధి అరుగుమీద వ్యవహారాలలో మునిగిన ఃభూపతి చాలా ప్రొద్దుపోయిన తర్వాత వచ్చి ప్రక్కమంచం మీద పడుకోడం కూడ ఆమె చూచింది. అతడు ప్రక్కమీద పడుకున్న కొద్ది సేపటిలోనే గురకపెట్టాడు. సుబ్బమ్మ ప్రక్కమీద నుంచి కదిలింది. మెల్లగా అతని ప్రక్క దగ్గరకు చేరింది. అతడలాగే నిద్రపోతున్నాడు. ముఖం మీదకు వంగింది. అతని పెదవులకు తన పెదవులను చేర్చింది. చెంపకు చెంప రాచింది. ఆపలేని తమకం ఎదుట చలనం లేని మనిషి. ఏం చేయాలి? తన పడకమీద పడి వెక్కివెక్కి ఏడ్చింది. ఆ సమయంలో క్రింద కాలుపెట్టకుండా చేసుకుపోయే పనిమనుషులూ—గుదిబండలా మెడపట్టకుండా ఉండే బంగారు నగలూ—ఆమెకు తుచ్ఛాలుగా కన్పించాయి.ఏదో విలువైన వస్తువును పోగొట్టుకున్నట్టే బాధపడింది. దిండులో తలదూర్చి ఏడ్చింది. కాని, విలువైన రాత్రి గడిచేపోయింది. అది సుబ్బమ్మకోసం ఆగదు. ఆ మాటే తల్చుకుంటే ఆమెకుకోసం కట్టలు త్రెంచుకొస్తుంది. పొంగి పొర్లుతుంది. అయినా, ఎవ్వరినీ ఏమీ చేయలేని నిస్సహాయ. అభిమానం అడ్డువస్తుంది అవమానం వెంటాడుతుంది. ఎందుకొచ్చిన అభిమానం? సుఖంలేని బ్రతుకెందుకు? ఏవేవో భావాలు పరుగులు తీస్తూఉంటే పరవశంకావడానికి వీలులేనిస్థితిలో కొట్టుకు లాడుతుంది. ఆక్రందిస్తుంది. ఎన్నోరాత్రులలా గడచిపోయాయ్. ఒక్కొక్కరాత్రి ఒక్కొక్క మధుర క్షణం—సుబ్బమ్మ నాటిననుభవించలేని జీవచ్ఛవం.

* * *

డాబామీద కూర్చున్న భూపతి పరధ్యానంగా గడివైపుచూశారు. రాను, రాను దొమ్మరసాని దగ్గరపడుతూంది. ఆమె వేషధారణ అతనికినచ్చలేదు. అసహ్యంగా మరోవైపు దృష్టిని మలుపుకున్నాడు బలవంతాన. పిల్లలు డాబామీద ఆడుకుంటున్నారు. వారికి బయట జరిగే తతంగమంతాపట్టలేదు. మరు నిమిషంలో భూపతి దృష్టి వారిమీద నిలిచింది. సాని తన జీవితంలో మొదటి సారిగా ఒక అమోఘమైన లఘువు చూపించి ముందుకు సాగింది.......

ఆమనికాలం పైర్లన్నీ కళ్ళాలలో చేరినాయ్. ఇంట్లో ఊపిరి సలపని భూపతి సతమతమవుతున్నాడు.అల్లుడికి పనులు చేసుకొనడం కష్టంగా ఉంటుందని శీతారాంగారుసంటోడిని సాయంగా పంపాడు. అన్ని పనులూ నేర్పుతో చేసుకుంటూ ఇంట్లో ఒకడుగా కలిసిపోయాడు వాడుకూడ.

సంటోడు ఆ యింట్లో ప్రవేశించి నప్పటి నుండి సుబ్బమ్మలో అనుకోని కొన్ని మార్పులొచ్చాయి. ఆమె నానాటికీ రెండు వ్యతిరేఖార్థాల మధ్య కొట్టుకు లాడుతున్నాదిలా అయిపోయింది.

ఒకరోజు సంటోడు ఎద్దులకు నీళ్ళుత్రాపుతున్నాడు ఈలవేస్తూ.

ఇంట్లో ఎవరూ లేరు

సుబ్బమ్మ విసురుగా అక్కడికి వచ్చింది. సంటోడు ఆశ్చర్యంగా ఆమె వైపు చూచి ''ఏంటమ్మగారూ! అలా చిక్కిపోయారూ'' అని అడిగాడు.

సుబ్బమ్మ జవాబు నివ్వలేదు. అడుగులో అడుగు వేసుకుంటూ మళ్ళీ ఇంట్లోకి పోయింది జవాబైనా ఇవ్వకుండా.

''అమ్మగారు చాలా చాలా మారిపోయినారు'' సరిపుచ్చుకొని తనపనిలో తాను మునిగి పోయాడు సంటోడు.

అయితే, ఆరోజు రాత్రి జరిగిన సంఘటన వాడిని విచలితున్నే చేసింది.

భూపతి కళ్ళం లోనికి పోయాడు. చూసి చూసి బాధ్యతనంతా పాలేర్లమీదనో—పరుల మీదనో వదలి వేయలేడాయన.

లోకాన్నంతా చీకట్లు క్రమ్మి వేశాయ్. చీకటిలో తారకలు మిణుకు మిణుకుమంటున్నాయ్. మిణుగురు పురుగులు తళుకు తళుకుమంటూ చీకటిలో బాటలను ఏర్పరస్తున్నాయ్.

సుబ్బమ్మ ఇంట్లో ఒంటరిగా కూర్చొనిఉంది. పిల్లలు డాబామీద గదిలో నిద్రపోతున్నారు. సవతి పిల్లలని వాళ్ళమీద అనుమాత్రం ఆమెకు ద్వేషంలేదు. ఎటొచ్చీ తన అందం—యవ్వనం—వృథాగా పోగొట్టుకొనడం ఆమెకు ఇష్టం లేదు. కాని తనకోరిక సఫలం చేసుకొనడమెలా? ఆమెకూ ఒక పరిధి వుంది. ఏదైనా తప్పటడుగు వేసిందంటే మళ్ళీ జన్మలో ఒడ్డుకు చేరుకోలేదు. అలా అని వూరుకోగలదా? మనసును నిలబెట్టుకోలేదు. కొట్టవొచ్చేట్టున్న యవ్వనం 'ఇది మంచి—ఇది చెడ్డ' అని తెలుసుకోనివ్వదు.

సంటోడు ఇంకా ఇంటికి రాలేదు.

ఇంటి కెదురుగా చీకట్లో చింతచెట్టు గుబురుగా దట్టంగా భయంకరంగా ఉంది. చెట్టుకొమ్మల్లో గూబలు గ్రుడ్లు మిటకరిస్తున్నాయ్. వెలుగులేని ఆ ప్రదేశంలో అని ఎంత ప్రకాశవంతంగా వున్నా ఏదో పిశాచ తత్వం వాటిలో గోచరిస్తోంది. భయాన్నికూడా కలిగిస్తోంది.

సంటోడు ఎక్కడ నుండో వూడిపడ్డాడు. దొడ్ల సానిట్లో పాలేర్లు నిద్రపోతున్నారు మత్తుగా. పంచ అరుగుమీదదుప్పటి పరుచుకొనడానికి ప్రయత్నిస్తున్న సంటోడికి 'ఎవరూ' అన్న పరామర్శ అడ్డుతగిలింది. వెనుదిరిగి చూశాడు.

వాకిలి వోరగా తెరచుకుంది. సుబ్బమ్మ అడిగింది. ''సంటీ భోంచేశావా''

''లేదమ్మగారూ ఈపూట ఆకలిగా లేదు'' పడుకోబోతూ అన్నాడు. వాడికి తెలుసు ఎప్పుడూ ఆవేళప్పుడు పాలేళ్ళకోసం అమ్మగారు కాచుకొని ఉండదు. ఏమిటో విశేషం.

''కాస్త భోంచేయ్. వూరక పడుకోకూడదు'' మాటల్లో తెచ్చిపెట్టుకున్న హుందాతనం కనిపించింది.

సంటోడు ఉలిక్కిపడి లేచి ఇంట్లోకి నడిచాడు. సుబ్బమ్మ ముందుగానే వంటగదికి దారి తీసింది.

సుబ్బమ్మ తన చేతులమీదుగా వడ్డించింది. 'కావాలా' అని గ్రుచ్చి గ్రుచ్చి అడిగి వడ్డించింది. ఆమె చేతి వడ్డన వాడికి విందే అయింది.

సంటోడు లేచి, బయటికిపోయి, అమ్మగారు నిద్రపోయారనుకున్న తర్వాత బీడీ వెలిగించి తృప్తిగా దమ్ముపీలుస్తూ పడుకున్నాడు.

బయట చలిగా వుంది. మంచుకూడా కురుస్తోంది.

''చలి వేయడం లేదూ'' తలుపుదగ్గర నుండి ప్రశ్న. సంటోడు ఉలుకలేదు. పలుకలేదు.

''ఇంట్లోవచ్చి పడుకో. చలిలో పడుకుంటే జ్వరాలొస్తాయ్''

సంటోడు దుప్పటి ముడిచి లోపలికిపోయాడు. గాదెదగ్గర దుప్పటిలో ముడుచుకొని పడుకున్నాడు. తలుపులుమూసి సుబ్బమ్మ మంచము వైపు పోయింది. అంతా చీకటిగా వుంది. సంటోడికి అనుమానం—దిగులు—గ్రుడ్లు మిటకరిస్తూ అలాగేపడుకున్నాడు. సుబ్బమ్మ దగ్గరలోనే మంచము వాల్చుకుంది. దానిమీద పడుకున్నదల్లా ఒకసారి లేచి మేడమెట్లవైపు దారితీసింది. అంతలోనే చటుక్కునవచ్చి పడుకుంది. సంటోడిని గొడ్లసావిట్లో పడుకోమంటేనో? లోపలికి

యెప్పుడు తిరిగిచింది. ఇప్పుడు మళ్ళీ బయటికి పోవుదాంలే వాడేమనుకుంటాడో? కిరణాల— కిరణాలలో రంగుపడటం—తనకు వైకం కష్టంగం— సంటోడి వడిలో తాను పడిపోవడం—వలయాలుగా ఆమె మనసులో తిరుగుతున్నాయ్. హృదయం మరింత బలహీనమై పోతుంది.

సంటోడికి మగతగా నిద్రపట్టింది. సుబ్బమ్మ మెల్లిగా లేచి ఒక్కసారి వళ్ళు విరుచుకుంది. ఒక్క క్షణం తటపటాయించి, ముందుకు వెళ్ళి 'ఓష్' అంటూ నడిమీద వాలిపోయింది. వాడికిదేం అర్థం కాలేదు. గౌరవంగా తప్పుకోబోయాడు. నా చిన్నమ్మగారి ఆజ్ఞ! ఆమె చెప్పినట్లల్లా చేశాడు వాడు.

గడ్డు సానిట్లో పైలకోడి గాటిలో సంకటంగా అటూ ఇటూ కదిలింది. చుట్టూ పడుకున్న పాలేర్లు ఇంట్లో ఏం జరుగుతోందో తెలుసుకొనే స్థితిలో లేరు. నోరులేని పైలకోడి మాత్రమదంతా గ్రహించింది. దాని కను కొలుకులనుండి ఒక కన్నీటి బొట్టు రాలిపోయింది.

• • •

దొమ్మరసాని ఒకచోట ఆగింది. చెమట బొట్లు ధారలుగా కారుతున్నాయ్. పశ్చిమదిశకు వాలుతున్న సూర్యుని కిరణాలలో అవి తళుక్కుమని మెరిశాయ్. ముందుకు పోవడానికి ప్రయత్నించింది సాని. చేతులలో బలము సన్నగిల్లినట్లైంది. నిదానంగా ఆపరిస్థితినుండి కోలుకుని, శక్తినంతా కూడదీసుకుని ముందుకు సాగింది... ...

సుబ్బమ్మ కళ్ళునులుముకొని లేచి చుట్టూ చూసింది. ఉదయ గీతాలతో పక్షులు కిలకిలమంటూ ఆకాశంలోని కెగసిపోతున్నాయ్. రెక్కలు తెగిన పక్షులు కొన్ని కొట్టుకులాడుతున్నాయి. దారి తప్పిన బాటసారులు ఎటు పోవాలో నిర్ణయించుకోలేక తికమక పడుతున్నారు.

సినిమా పాటలు—ఫ్యాక్టరీ సైరనులు—మోటారుకార్ల హారన్లు—గజిబిజిగా —అయోమయంగా వుంది వాతావరణం. రాత్రి చెట్లక్రింద పడుకున్నవారంతా ఎవరికివారే వాళ్ళ దారిన వాళ్ళు పోతున్నారు. సుబ్బమ్మకేం చెయ్యాలో—ఎటు పోవాలో తోచలేదు. రాత్రి తనతోపాటు వున్న సంటోడు ఏమైనట్టు? ఎక్కడికి వెళ్ళినట్టు? ఎవరి నడగాలి? ఎవరికి తెలుస్తుంది వాడి సంగతి?

ఆచుట్టు ప్రక్కల కెక్కడైనా వెళ్ళాడేమో, వస్తాడు లెమ్మని సరిపెట్టుకొంది. కాని, హృదయము మాత్రం వూరక ఆరాట పడి పోతోంది.

సూర్యుడు చురచురమంటూ తూర్పు దిక్కున పొడిచాడు. విధి తనమీద కారాలు—మిరియాలు నూరుతోందని క్రుంగి పోయింది సుబ్బమ్మ. ఎంత సేపు నిరీక్షించినా సంటోటి జాడేలేదు.

ప్రక్కనే ఒక దీర్ఘకాయుడు జబ్బుతో తీసుకుంటున్న ప్రాణికి ఉపచారాలు చేస్తున్నాడు. అతనికేమైనా సంటోడిని గురించి తెలుసేమో అడుగుదామనుకుంది. కానీ, ఏమని అడగాలి? వెక్కి వెక్కి ఏడుస్తూ భూమిమీద కూలబడి పోయింది.

"మంచి వాడిని నమ్ముకొని వచ్చావమ్మాయ్" తొణుకులేని కంఠంనుండి వెలువడ్డ మాటలు వినిపించాయ్ సుబ్బమ్మకు.

అవి వచ్చిన దిక్కుగా దీనంగా చూసింది.

రోగికి ఉపచారాలు చేస్తున్న అతడు అన్నాడు: "నీవు నమ్ముకొని వచ్చినవాడు ఇకరాడు. తన పెద కాపుకు అన్యాయం చేశాడట! ఇక తనకు నిష్కృతి లేదనీ—దైవం క్షమించదనీ— వెళ్ళిపోయాడు. ఇక్కడివరకు నీలో ఏదోశక్తి వాణ్ణిలా తీసుకువచ్చిందట! తన కర్మకు ప్రాయశ్చిత్తం చేసుకోడానికి ఎటో వెళ్ళిపోయాడు. ఇక ఎప్పుడూ నిన్ను చూడడు".

సుబ్బమ్మ మ్రానులాగా నిశ్చేష్టిత అయిపోయింది. ఆమె నమ్ముకున్న వాడిలా నట్టేట్లో ముంచి పోయాడు. ఇప్పుడేం చేయాలి?

భూమి—సముద్రం—దేవుడూ— అందరూ అప్పుడు కనిపించారు. కళ్ళకు పొరలు గప్పి హృదయ దౌర్బల్యంతో తారతమ్యం తెలియకుండా ప్రవర్తించింది. దాని ఫలితం?

ఏకాకిగా, నికృష్ట జీవితం గడపాలి.

తన కుటుంబానికి వన్నె తెస్తుందనీ—కుటుంబ గౌరవాన్ని నిలబెడుతుందనీ—అగ్నిసాక్షిగా పెళ్ళాడిన భర్త ఎదుట నిలచి "నీకిప్పుడైనా అర్థమవుతుందా" అని నిగ్గదీసి అడిగి నట్లైంది.

ఎదురు తిరిగే మనసుకేం జవాబు చెప్పాలో చెప్పుకోవాలో, తెలియని చిక్కటి బంధంలో తగులుకుందామె.

"నావెంట ఉండు.నీకేమీ లోటు రానివ్వను" ఆదీర్ఘకాయుడి మాటలు కంగున మ్రోగాయి ఆమె కర్ణ పుటాల్లో.

ఎంత చులకనై పోయింది తను?

ఇక ఆలోచించుకోలేక పోయింది. చేతుల్లో మొగాన్ని దాచుకొని ఆక్రోశించింది.ఆ ఆక్రందన విని ఆదరించడానికి తనవాళ్ళని చెప్పుకోదగ్గ వాళ్ళందరినీ దూరం చేసుకుంది. ఆమె ఇప్పుడు ఇష్ట, నిష్టలతో పనిలేకుండా అడ్డమైన వాళ్ళ ఆదరానికి ఎదురు చూడాలి.

దీర్ఘకాయుడు సుబ్బమ్మ వీపుమీద చేయివేసి నిమురుతూ, ఆదరంగా తనతో రమ్మని ఆహ్వానించాడు మళ్ళీ. తనకిక దిక్కెవరున్నారు? కన్పించిన తీగనల్లా రక్షణకోసం పట్టుకు ప్రాకడమే తనకు విధి లిఖించాడు.

సుబ్బమ్మ వాడితోపాటు మజిలీలు మార్చింది. వాడు వీరమల్లు. దొమ్మరాట ఆడతాడు. దొరకినప్పుడు బాగా దొరకుతాయి డబ్బులు. లేకుంటే ఉపవాసం. ఒక మజిలీలో వీరమల్లు తమ్ముడు పోయాడు. ఆతర్వాత ఆటలో ఆమెకే తర్ఫీదు నిచ్చాడు.

అప్పటినుండి సుబ్బమ్మ దొమ్మరసాని అయింది.

శరీరాన్ని కడ్డీలా వంచేయగలదు. చెంగున లేడిపిల్లలా ఎగుర గలదు. ఆడగలదు—పాడగలదు. చెమక్కుమని మెరిపించగలదు. ఆవిడ రంగంలోనికి దిగిన తర్వాత వీరమల్లు పనికూడా హాయిగావుంది.

• • •

దొమ్మరసాని గడ చివరనందుకుంది పైనుండి ఒక్కసారి కలయ జూచింది. చుట్టూ మేడలు—మిద్దెలు—కదలుతూన్న జనం—గడనెక్కిన ప్రతిసారీ అనుభవమయ్యే దృశ్యమే అది.

సాని ముందుకు వంగి, గడమీద నాభి నానించి ముందుకు వాలింది. చేతులు, కాళ్ళు గాలిలో తేలిపోయాయ్.

జనంలో ఉత్సాహం—కేరింతాలు—వూలలు—కరతాళాలు.

వీరమల్లు మనసు పొంగి పోయింది.

మేడ వరండాలో ఉన్న భూపతి అప్రయత్నంగా డాబామీది పిట్టగోడ దగ్గరకుచేరాడు. సాని గడమీద ఇంకా అలాగే వుంది. భూపతి గారి హృదయము ఒక్కసారిఆవేశంతో పొంగిపోయింది. నిభాయించుకొని శాంతంగా నిలుచున్నా డక్కడే. ఆసమయంలోనే ఎదురుగా, గంభీరంగా నిలుచున్న ఆ మూర్తిని సాని చూచింది. ఒక్కసారి మ్రాన్పడి పోయింది. మరు నిముషంలో కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. ప్రపంచమంతా తిరుగుతున్నట్లైంది. క్రిందవున్నజనం తలక్రిందులుగా కన్పించారు. కళ్ళు మూసుకుంది. దాటవ్వు పోయింది. కెవ్వుమన్న కేక భయోత్పాతంలో రేగిన హాహారావాల్లో కలిసి పోయింది.

వీరమల్లు సానిదేహంమీద పడి గోడు గోడు మంటున్నాడు. భూపతిగారు గుంపును త్రోసుకుంటూ అక్కడికి వచ్చారు. అప్పటికే సాని జీవుడు అనంతాకాశంలో కలిసిపోయాడు, ఆయునకళ్ళు అశ్రుపూరితాలయ్యాయ్. ఒక్క నిట్టూర్పు విడిచి ఆచోటు వీడి పోయాడెవటికో!

★

